# విద్వేషాయస్వాహా

"**రా**జకీయాల్లో జాతులూ, కులాలూ, మతాలూ ప్రవేశించటం చాలా ఘోరం. వీటిని మనం అంతమొందించాలి," అన్నాడు నా స్నేహితుడు.

జీవితంలో ఉన్న వాటిని రాజకీయాల్లో నుంచి తీసివెయ్యటం అంత సులభం కాదేమోనన్నాను.

"సాధ్యం కాకపోతే సాధ్యం చెయ్యాలి. ఎక్కడో ఫాసిస్టులున్నారని మనం ఎంత పెద్ద యుద్ధం చేశామో చూడు. ఎక్కడో సాయబులెక్కువగా ఉన్నారని పాకిస్థాను బాధ మనం పడుతున్నామా లేదా? ఇది సాగటానికి వీల్లేదు."

ప్రపంచమంతా ఒకటవుతుందుకు ఇదే తార్కాణమనీ, మన సమస్యలు కావని చూస్తూ ఊరుకోవటానికి వీల్లేదనీ అన్నాను.

"కనకనే మనం ఏదో ఒకటి చెయ్యాలి," అన్నాడు నా మిత్రుడు. ఏం చేస్తామన్నాను.

"అసలీ వైషమ్యాలు ఎట్లా ఏర్పడుతున్నాయో చూడు. మన దేశంలో సాయబులు తోక ఝాడించకపోతే మన దేశంలో మతవైషమ్యం లేదు. తక్కువ కులాలవాళ్లు తోక ఝాడించకుండా ఉంటే కులవైషమ్యం లేదు. తెలుగువాళ్లను మిగతా ప్రాంతాల వాళ్లు నీచంగా చూడకుండా ఉంటే జాతి వైషమ్యం లేదు. ఈ వైషమ్యాలు అంతమొందించాలంటే రాజకీయ పెత్తనమంతా తెలుగువాళ్లకీ, అందులో హిందువులకీ, వాళ్లలో బ్రాహ్మలకీ ఇచ్చెయ్యాలి. అప్పుడు ఏ వైషమ్యాలూ ఉండవు" అన్నాడు నా స్నేహితుడు.

ఇది ఎట్లా సాధ్యమవుతుందన్నాను.

"సత్యాహింసలు! నిరశన వ్రతాలు! నిర్మాణ కార్యక్రమం!" అన్నాడు నా అమూల్య స్నేహితుడు.

***ముద్రణ : ఆనందవాణి, 20 జూలై 1947***